

రామగుండం కార్పొరేషన్‌లో నియామకాలు బంద్ 8లో..
నాటి పంట పొలాలే నేడు వెంచర్లుగా..

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:27 మంగళవారం
సహర్ 4:46 బుధవారం



సుల్తానాబాద్ హోలీ వేడుకలు జరుపుకుంటున్న మహిళలు

పెద్దపల్లిలో..

హోలీ రంగుల కేళీ

జిల్లా వ్యాప్తంగా హోలీ వేడుకలు అంబరాన్నంటాయి. సోమవారం చిన్నాపెద్ద తేడా లేకుండా ఒకరికిఒకరు ఆనందోత్సాహాలతో రంగులు పూసుకున్నారు. దీంతో కాలనీలు రంగులమయమయ్యాయి. యువతీయువకులు ఉత్సాహంతో నృత్యాలు చేశారు. వేడుకల్లో ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పాల్గొన్నారు. కమిషనరేట్‌లో జరిగిన కార్యక్రమంలో రామగుండం సీపీ ఎం శ్రీనివాస్ సిబ్బంది, చిన్నారులతో కలిసి స్టెప్పులు వేశారు.

పెద్దపల్లి కల్చరల్, మార్చి 25: పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఉదయం నుంచి యువతి యువకులు, చిన్నారులు విద్యార్థిని విద్యార్థులు రంగులు చల్లుకుంటూ హోలీ సంబరాలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. పట్టణంలో మర్వాడిలు బ్యాండ్ మేళం చప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ హోలీ రంగులు చల్లుకున్నారు. జూనియర్ కళాశాల మైదానంలో వాకర్స్ అసోసియేషన్, వ్యాపారస్తులు రంగుల్లో తేలారు. కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన హోలీ వేడుకల్లో అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్ పాల్గొని రంగులు చల్లారు. పట్టణంలోని జండా చౌరస్తా, తెలంగాణ చౌరస్తా, అంబేద్కర్ కూడలి మొదలగు ప్రాంతాల్లో యువకులంతా రంగులు చల్లుకుంటూ కోడిగుడ్లు కొట్టుకుంటూ కేరింతలు వేశారు. ప్రజలకు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, బీజేపీ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు సంబరాల్లో మునిగితేలారు. నల్ల పోచమ్మవాడలోని కాలనీలలో ఘనంగా ఉత్సవాలు జరుపుకున్నారు.

- ఆనందోత్సవాల మధ్య హోలీ వేడుకలు
- రంగులమయమైన కాలనీలు
- ఉత్సాహంతో నృత్యాలు చేసిన యువతీయువకులు

పెద్దపల్లి రూరల్: మండలంలోని పెద్దకల్వల, హన్మంతునిపేట, అందుగులపల్లి, కనగర్తి, కాపులపల్లి, పాలితం, బొంపల్లి, అప్పన్నపేట, రాఘవపూర్, రంగాపూర్‌లతో పాటు పలు గ్రామాల్లో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సందర్భంగా యువత రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మార్కండేయకాలనీ/కళ్యాణ్‌నగర్: గోదావరిఖనిలోని అన్నీ కాలనీల్లో చిన్నా పెద్దా రంగులు చల్లుకుంటూ హోలీ పర్వదినాన్ని జరుపుకున్నారు. దీంతో కాలనీలు రంగులమయమయ్యా యి. గోదావరిఖని చౌరస్తాలోని వైట్ హౌస్ వద్ద పలు పార్టీల నాయకులు హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ చౌరస్తాలో హోలీ ఆడు తున్న నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్‌కు వివిధ పార్టీల నాయకులు రంగులు పూ స్తూ శుభాకాంక్షలు తెలిపారు. వివిధ వాడల్లో పిల్లలు హోలీ వేడుకల్లో పాల్గొన్నారు.

మంథని: నియోజకవర్గ కేంద్రమైన మంథనిలో వివిధ రాజకీయ పార్టీ ల నేతలు ప్రజలతో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. యువకులు, చిన్నారులు, మహిళలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ శుభా కాంక్షలు తెలుపుకున్నారు. దీంతో వీధలన్నీ సందడిగా కన్పించాయి. వివిధ రంగులతో తడిచిన వారంతా గోదావరినది తీరానికి వెళ్లి స్నానాలు చేశారు.



గోదావరిఖనిలో చిన్నారుల సంబరాలు

మంథని రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో యువకులు, పెద్దలు, చిన్నారులు పురవీధుల గుండా తిరుగుతూ రంగులు చల్లుకుంటూ ఒకరికొకరు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. యువత డప్పు చప్పు ళ్ల మధ్య నృత్యాలు చేస్తూ కేరింతలు కొట్టారు.

సుల్తానాబాద్: పట్టణంలోని వైశ్యా భవన్‌లో వైశ్య కుటుంబ సభ్యులు పెద్దఎత్తున పాల్గొని అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. వాకర్స్ ఆధ్వర్యంలో కళాశాల మైదానంలో సంబరాలు చేసుకున్నారు. వ్యాపారులు, ఉద్యోగులు డాక్టర్లు యువత పెద్ద ఎత్తున స్థానిక ఐబీ చౌరస్తా వద్ద రంగుల పండుగను ఎంజాయ్ చేశారు. మున్సిపల్ ఆఫీసు వద్ద చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, వైస్‌చైర్‌పర్సన్ బిరుదు సమత క్రిష్ణ, పలువురు కౌన్సిలర్లు హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మున్సిపల్ ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు. .

ధర్మారం/జూలపల్లి/పాలకుర్తి: మండలాల్లో చిన్నపెద్దా తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. హోలీ పండగ వేడుకల అనంతరం గోదావరిలో స్నానాలచరిండానికి వెళ్లారు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉద్యోగులు, వ్యాపారులు, మహిళలు, పిల్లలు హోలీ వేడుకలు జరుపుకున్నారు. మహిళా రైతులు పంటపొలాల్లో హోలీ వేడుకల్లో పాల్గొని రంగులు చల్లుకున్నారు. ఎంపీపీ నూనేటి సంపత్ తన వ్యవసాయ భూమిలో తోటి రైతు కూలీలతో కలిసి హోలీ పండుగ జరుపుకున్నారు.

ఓదెల: మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల సోమవారం హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామి, శివాలయంతో పాటు పొత్కపల్లి, కనగర్తి, కొలనూర్, గ్రామాల్లోని ఆలయాల్లో మహిళలు ఉసిరికాయలతో దీపాలను వెలిగించారు. అనంతరం ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

రామగిరి: మండలంలో కుల, మతాలకు అతీతంగా యువకులు, నాయకులు, కార్మికులు హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. ఎలాంటి అవాంచ నీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు.



హోలీ వేడుకల్లో పాల్గొన్న జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్, పలు పార్టీల నాయకులు



హోలీ వేడుకల్లో అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్, ఉద్యోగులు

స్టెప్పులు వేసిన సీపీ శ్రీనివాస్



పోలీస్‌లతో కలిసి స్టెప్పులు వేస్తున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ: రామగుండం పోలీస్ కమిషరేట్ హెడ్ క్వార్టర్‌లో సోమవారం హోలీ సంబరాలు ఘనంగా జరిగాయి. కమిషనర్ ఎం శ్రీనివాస్ పోలీస్ అధికారులు, సిబ్బంది, కమిషనరేట్ ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్, అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సీ రాజు, పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాష్, ఏఆర్ ఏసీపీ సురేంద్ర, సీఐలు, ఎస్ఐలు సంబరాల్లో పాల్గొన్నారు. ఒకరిపైఒకరు రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. నృత్యాలు చేస్తూ సంబరాల్లో తేలారు. కమిషనర్ శ్రీనివాస్ తోటి పోలీస్ అధికారులు, సిబ్బంది, పోలీసుల పిల్లలతో కలిసి స్టెప్పులు వేశారు.

వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు..



హోలీ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, కాంగ్రెస్ నాయకులు

కోల్‌సిటీ: రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సోమవారం గోదావరిఖని మెయిన్ చౌరస్తాలో జరిగిన హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వ్యాపారులు, వివిధ పార్టీల కార్యకర్తలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. హోలీ ప్రేమాభిమానాలకు, ఐక్యతకు చిహ్నమని, రంగుల మాదిరిగానే జీవితాల్లో ఆనందాలు విరాజిల్లాలన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు దీటి బాలరాజు, ఉల్లంగుల రమేష్, బొంతల లచ్చన్న, కారం వినయ్, లడ్డు, అనుమ సత్యనారాయణ, దాసరి ఎల్లయ్య, మొహిద్ సన్ని, మాలెం మధు ఉన్నారు. అనంతరం రఘురాములు విగ్రహ పరిసరాలను ఎమ్మెల్యే పరిశీలించారు.



హోలీ వేడుకల్లో ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు: హోలీ పండుగ సంబరాలను ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పలు వురు ప్రజాప్రతినిధుల మధ్య వేడుకలు జరుపుకున్నారు. మండలం లోని పలు గ్రామాల్లో హోలీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, ఎంపీపీ తానిపర్తి స్రవంతిమోహన్‌రావు, జడ్పీవైస్‌చైర్‌పర్సన్ మండిగ రేణుకరాజనర్సు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



గోదావరిఖనిలో హోలీ ఆడుతున్న మహిళలు, చిన్నారులు



పెద్దపల్లిలో హోలీ ఆడుతున్న యువకులు

నిరుపయోగంగా బస్ షెల్టర్లు





తెలంగాణ, పన్నూరు సెంటర్లలో వృథాగా మారిన బస్ షెల్టర్లు

రామగిరి, మార్చి 25: ప్రయాణికుల సౌకర్యం కోసం సింగరేణి సంస్థ నిర్మించిన బస్‌షెల్టర్లు నిరుప యోగంగా మారాయి. సింగరేణి సుమారు రెండు దశాబ్దాల క్రితం తెలంగాణ, పన్నూరు సెంటర్లలో బస్ షెల్టర్లు నిర్మిచింది. తెలంగాణ సెంటర్ బస్టాప్ కు దూరంగా వేసిన బస్‌షెల్టర్ చెత్తాచెదారంతో నిండుకొని ఉండి ప్రజలకు వినియోగం లేకుండా ఉంది. దీనితో పాటు షెడ్‌కు ముందు వ్యాపారం జరుగుతుండడంతో షెడ్ కనిపించే పరిస్థితి లేదు. పన్నూరు సెంటర్ మీదుగా గతంలో గోదావరిఖని వెళ్లేందుకు ప్రయాణికులకు కోసం నిర్మించిన బస్‌షెల్టర్ నేడు వృథాగా మారింది. ప్రస్తుతం గోదావరిఖని వెళ్లే రూట్ టిటూ సెంటర్ నుంచి కోల్‌కారిడార్ రోడ్డు ఏర్పడడంతో పన్నూరు క్రాస్ రోడ్‌లో ఆర్‌సీతో నిర్మాణం చేపట్టిన బస్‌షెల్టర్ ద్విచక్రవాహనదారు లకు పార్కింగ్ స్థలంగా మారిం ది. ప్రయాణికులకు వర్షా కాలం, ఎండా కాలంలో నిలువ నీడలేకుండా పోయింది.

కాగా వివిధ పార్టీల నేతలు స్వచ్ఛందంగా నిర్మా ణం చేపట్టిన రెండు బస్‌షెల్టర్లలో ఇటీవల మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారి రోడ్డు వెడల్పు లో తొలగించగా, మరోకటి సింగరేణి ఉద్యోగులకు ద్విచక్రవాహనాలకు షెడ్‌గా మారింది. కోల్‌కారిడార్, తెలంగాణ సెంటర్‌లలో బస్‌షెల్టర్లను నిర్మించాలని కార్మికులు, స్థానిక ప్రజలు సింగరేణి యాజమాన్యా న్ని కోరుతున్నారు.

ఇటిక్యాలలో ఘనంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం

రాయికల్, మార్చి 25: రాయికల్ మండలంలోని ఇటిక్యాల గ్రామంలో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి రథోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. మూడు రోజులుగా ఆలయంలో జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సోమవారం సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తులను రథంపై ఆశీనులుగావించి ఆలయం చుట్టూ రథాన్ని లాగడానికి భక్తులు పోటీపడ్డారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి, మాజీ ఎంపీపీ కాటిపెల్లి గంగారెడ్డి, మాజీ సర్పంచులు గంగారెడ్డి, నారాయణ గౌడ్, సామల్ల లావణ్యవేణు, నాయకులు శ్రీనివాస్, చంద్రశేఖర్, రఘునాథాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఎస్సారెస్పీ కాలువలో పడి యువకుడి మృతి

రాయికల్, మార్చి 25: రాయికల్ మండలంలోని కుమ్మరిపెల్లి గ్రామంలో ఎస్సారెస్పీ కాలువలో పడి మానసిక, శారీరక వైకల్యం గల జిల్లాల నవీన్ (28) అనే యువకుడు మృతి చెందాడు. నవీన్ గ్రామ శివారులోని చర్చికి ఆదివారం ఉదయం 10 గంటలకు వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు వెతకగా ఎస్సారెస్పీ కాలువలో పడి మృతి చెందినట్లు రాత్రి 8:30 గంటలకు గుర్తించారు. కాలువ వద్దకు మల విసర్జనకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి పడి నీటిలో మునిగి చనిపోయినట్లు కుటుంబీకులు తెలిపారు. మృతుని అన్న సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అజయ్ తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించిన నలుగురిపై కేసు

రాయికల్, మార్చి 25: రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు, సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. రాయికల్‌కు చెందిన సూర్య, కిరణ్, అభి, సన్నీతో పాటు మరి కొందరు మధ్యాహ్నం 12:15 గంటల ప్రాంతంలో రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న వైద్యుడు, ఆస్పత్రి సిబ్బందిపై దుర్భాషలాడుతూ బెదిరించారు. డ్యూటీ డాక్టర్ ఉదయ్ కుమార్ ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజయ్ తెలిపారు.

ధర్మపురిలో ఉగ్రనారసింహుడి డోలోత్సవం

● వైభవంగా బ్రహ్మోత్సవాలు ● మొక్కులు తీర్చుకున్న భక్తులు


ధర్మపురి బ్రహ్మపుష్కరిణిలో ఉగ్ర నారసింహుడి డోలోత్సవం


ధర్మపురి బ్రహ్మపుష్కరిణిలో ఉగ్ర నారసింహుడి తెప్పోత్సవం


ధర్మపురిలో స్వామివారి దర్శనం కోసం భక్తుల క్యూలైను

ధర్మపురి, మార్చి 25: ధర్మపురి క్షేత్రంలోని బ్రహ్మ పుష్కరిణి (కోనేరు)లో శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి (ఉగ్ర) తెప్పోత్సవం, డోలోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆస్థాన వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు నేతృత్వంలో అర్చకులు వంశీకృష్ణ, విజయ్, నవీన్ మధ్యాహ్నం వేళలో మంగళవాయిద్యాలు వెంట రాగా స్వామివారల ఉత్సవమూర్తులను సేవలపై ఉంచి బ్రహ్మ పుష్కరిణికి తీసుకువచ్చారు. అనంతరం హంస వాహన రూపంలో గల నూతన పడవ పైన స్వామివారలను కూర్చోబెట్టి, బ్రహ్మ పుష్కరిణి నీటిలో ఐదుసార్లు ప్రదక్షిణలు చేయించారు. భక్తులు నరసింహ నామ స్మరణ చేస్తూ మెట్లపైన ప్రదక్షిణలు చేయగా కొందరు మహిళలు త్రిశూలం చేతబట్టుకుని పూనకాలతో స్వామి వారలను కొలుస్తుండగా అర్చకులు తెప్పోత్సవం జరిపారు. అనంతరం స్వామివారల సేవలను బ్రహ్మ పుష్కరిణి మధ్య గల మండపంలోని ఊయలపై ఆశీనులు చేశారు. సనాతన సాంప్రదాయ రీతిలో అర్చకులు స్వామి వారల డోలోత్సవం నిర్వహించారు. భక్తులు వెళ్లి స్వామి వారలపై బుకాగులాలు చల్లి కట్న కానుకలు సమర్పిస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన భక్తులు డోలోత్సవం తిలకించిన అనంతరం నెత్తిమీద ముల్లెమూట పెట్టుకుని తిరుగు ప్రయాణం పట్టారు. గతంలో కన్న భక్తుల సంఖ్య అధికంగా తగ్గి పోయింది. బ్రహ్మ పుష్కరిణి అందంగా విద్యుత్ దీపాలతో శోభిల్లింది. రాత్రివరకు ఉత్సవ కార్యక్రమాన్ని కొనసాగించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ధర్మపురి ధర్మపురి సీఐ రాంనర్సింహరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ ఉదయ్ కుమార్ సహా పలువురు ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జగిత్యాల జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, జడ్పీటీసీ బత్తిని అరుణ, కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, కమిటీ సభ్యులు ముత్తినేని మల్లేశం, బాదినేని సత్యనారాయణ, రాందేని మొగిలి, దాసరి పురుషోత్తం, ఏదులాపురం మహేందర్, రాపర్తి సాయికిరణ్, స్తంభంకాడి గణేష్, పసుపునూటి శ్రీకాంత్, మాదాసు మల్లేష్, లసెట్టి సుజాత, కొమురెల్లి పవన్ కుమార్, నేదునూర్ శ్రీధర్, టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, ఆర్య వైశ్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు జక్కు పద్మ, పట్టణ ఆర్య వైశ్య, వర్తక సంఘాల అధ్యక్షులు మురికి శ్రీనివాస్, అక్కెనపెల్లి రాజేందర్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో భక్తుల పూజలు

ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అంకురార్పణ, పుట్ట బంగారం నుంచి శ్రీ లక్ష్మీ నృసింహస్వామి, శ్రీ వేంకటేశ్వర స్వామివారల కల్యాణ, తెప్పె, డోలోత్సవాలను నిత్యం వేలాది మంది భక్తులు తిలకించారు. అన్నదానం సమయంలో శెరిపల్లి కావేరి అనే భక్తురాలు బ్యాగ్, ఫోన్, పోగొట్టుకుంది. హెడ్‌కానిస్టేబుల్ శంకర్‌కు దొరకగా భక్తురాలు ఆచూకీ కనుగొని ఆమెకు అప్పగించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా యాగశాల వద్ద లోక క్షేమార్థం సుదర్శన హోమం నిర్వహించారు. ఐదవ రోజు ఆలయానికి రూ 11,26,000 ఆదాయం లభించింది. ఇందులో వివిధ రకాల పూజల టిక్కెట్లు విక్రయించగా రూ.4,84,463 లభించగా లడ్డు, ప్రసాదాల ద్వారా రూ. 4,94,885 లభించాయి. అన్నదానం కోసం భక్తులు రూ 1,46,652 విరాళాలు సమర్పించినట్లు ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 26న మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు బ్రహ్మపుష్కరిణి శ్రీ వేంకటేశ్వర స్వామి తెప్పె, డోలోత్సవం, సాయంత్రం శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దక్షిణ దిగ్యాత్ర ఉంటుంది. స్థానిక శేషప్ప కళావేదికపై రాత్రి కూచిపూడి నృత్య ప్రదర్శన ఉంటాయి.

కొండగట్టు ఇన్‌చార్జి ఈవోగా చంద్రశేఖర్

మల్యాల, మార్చి 25: కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా చంద్రశేఖర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఈవో వెంకటేష్‌పై దేవాదాయ శాఖ కమిషనర్ గత శనివారం సస్పెన్షన్ వేటు వేయడంతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టగా ఉద్యోగులు, అర్చకులు అభినందించారు

యవతిని ట్రాప్ చేసిన ఏఎస్సై వీఆర్‌కు అటాచ్

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఇబ్రహీంపట్నం, మార్చి 25: ఇబ్రహీంపట్నం ఏఎస్సై రాములుపై ఉన్నతధికారులు శాఖాపరమైన చర్యలు చేపట్టారు. ఈ నెల 25న 'ఆంధ్రజ్యోతి'లో 'ఠాణాకు వచ్చిన యువతిని ట్రాప్ చేసిన ఏఎస్సై' కథనం ప్రచురితం కాగా జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ స్పందించారు. ఏఎస్సై వ్యవహారం సీరియస్‌గా తీసుకుని చర్యలు చేపట్టారు. ఏఎస్సై వ్యవహారం జిల్లా వ్యాప్తంగా చర్చనీయంశం కావడంతో ఏఎస్సై రాములును జిల్లా హెడ్ క్వార్టర్ వీఆర్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. సమగ్ర విచారణ అనంతరం ఏఎస్ఐపై తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు పోలీస్ వర్గాల సమాచారం. ఇదిలా ఉండగా ఠాణాకు వచ్చిన మహిళలకు భద్రత కల్పించాల్సిన పోలీస్‌లే ఈ విధంగా ప్రవర్తించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతధికారులు దృష్టి సారించి ఇలాంటివి పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కుటుంబ కలహాలతో భర్త ఆత్మహత్య

సిరిసిల్ల రూరల్/కోనరావుపేట, మార్చి 25: భార్యాభర్తల మధ్య గొడవలు తలెత్తడంతో భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన సిరిసిల్ల పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో జరిగింది. సిరిసిల్ల పట్టాణానికి చెందిన గూడూరు సాగర్ (26) కారు డ్రైవర్‌గా పనిచేసున్నాడు. మూడేళ్ల క్రితం అదే కాలనీకి చెందిన గూడూరు అనూష, సాగర్ ఇరు కుటుంబాలను ఒప్పించి ప్రేమ వివాహం చేసుకున్నారు. పిల్లలు పుట్టకపోవడంతో పాటు సరైన కూలి పనులు దొరకక ఇబ్బందులు పడుతున్నాడు. సాగర్ తల్లిదండ్రులు చంద్రకళ, బాబు దంపతులు ఉపాధి కోసం కోనరావుపేట మండలం కొలనూర్‌లోని ఓ ఇంటిలో పని చేసుకుంటూ అక్కడే నివాసం ఉంటున్నారు. ఆర్థిక పరమైన ఇబ్బందులతో పాటు పిల్లలు పుట్టడం లేదని 20 రోజుల క్రితం సాగర్‌తో భార్య అనూష గొడవ పడి తల్లిగారింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఇంట్లో ఒక్కడే ఉంటున్నాడు. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో తల్లిదండ్రులు ఉంటున్న కొలనూర్ గ్రామానికి వెళ్లాడు. అక్కడే నిద్రించి తెల్లవారుజామున వారు ఉంటున్న ఇంటిపై ఉన్న సలాకకు చీరతో ఉరేసుకున్నాడు. సాగర్ తండ్రి బాబు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు తెలిపారు. మరోవైపు పండుగ పూట మిత్రుడు సాగర్ చనిపోవడంతో స్నేహితులతో పాటు ఇరు కుటుంబాల్లో విషాదం నెలకొంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేములవాడ రాజన్న క్షేత్రంలో భక్తుల రద్దీ


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు


డోలోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ, మార్చి 25: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రం సోమవారం భక్తులతో రద్దీగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు తమ ఇష్ట దైవమైన రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయం సైతం భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తులు అమ్మవారిని దర్శించుకొని బోనం మొక్కు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

ముగిసిన త్రిరాత్రి ఉత్సవాలు

వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రంలో నిర్వహిస్తున్న త్రిరాత్రి ఉత్సవాలు సోమవారం రాత్రి ముగిసాయి. శివకల్యాణ మహోత్సవాలకు ముందుగా మూడు రోజులపాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో భాగంగా చివరిరోజైన సోమవారం ఉదయం, సాయంత్రం రాజరాజేశ్వరస్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తులను కల్యాణ మండపం ఊయలలో ఉంచి డోలోత్సవం నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శివకల్యాణోత్సవాలు

ఈ నెల 27వ తేదీ బుధవారం నుంచి శివకల్యాణోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఐదు రోజులపాటు జరిగే ఉత్సవాలలో భాగంగా 28వ తేదీ గురువారం పార్వతీ రాజరాజేశ్వరస్వామివారల కల్యాణం నిర్వహించనున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

● హోలీ వేడుకల్లో విషాదం


కృష్ణవంశీ(ఫైల్)


శివకుమార్ (ఫైల్)

కరీంనగర్ క్రైం, మార్చి 25: అప్పటి వరకు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనంద కేళిలో మునిగి తేలిన ఆ యువకులు ఇద్దరు నిమిషాల వ్యవధిలోనే మృత్యువాత పడ్డారు. హోలీ సంబరాలు చేసుకున్న స్నేహితులు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఘటన తెలుసుకుని తోటి స్నేహితులు, తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. హోలీ పండుగ వేళ రెండు కుటుంబాల్లో విషాధం నింపింది. పోలీసులు, మృతుల స్నేహితులు తెలిపిన వివరాల ప్రకారం...

కరీంనగర్ శివారులోని మానేరు బైపాస్ రోడ్‌లో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీనగర్ కాలనీలో నివాసం ఉంటున్న పాను గంటి కృష్ణ వంశీ(24) అక్కడికక్కడే మృతి చెందగా గాంధీరోడ్‌లో నివాసం ఉంటున్న పాళ్ల శివకుమార్(24) ఆసుపత్రికి తరలిస్తుండగా మరణించాడు. కృష్ణవంశీ, పాళ్ల శివకుమార్‌లు సోమవారం ఉదయం నుంచి కరీంనగర్‌లోని పలు ప్రాంతాల్లో స్నేహితులతో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం స్నేహితులతో కలిసి భోజనాలు ముగించారు. కృష్ణవంశీ, శివకుమార్ సాయంత్రం 6 గంటలకు జ్యోతినగర్‌లోని స్నేహితుడి ఇంటి నుంచి అల్గునూర్‌కు బైక్‌పై వెళుతుండగా ఐటీ టవర్ వద్ద బైక్ రోడ్ డివైడర్‌ను ఢీకొట్టింది. ఇద్దరు డివైడర్‌పై ఉన్న సైన్‌బోర్డు స్తంభానికి తగలడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. కృష్ణవంశీ అక్కడికక్కడే మరణించగా శివకుమార్‌ను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మరణించాడు. మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచారు. మానకొండూర్ మండలం గద్దెపాకకు చెందిన కృష్ణవంశీ ప్రస్తుతం శ్రీనగర్ కాలనీలో తల్లిదండ్రులతో కలిసి నివాసం ఉంటున్నాడు. కృష్ణవంశీ పారామిలటరీ ఉద్యోగం కోసం హైదరాబాద్‌లో శిక్షణ పొందుతూ వారం రోజుల కిందటే కరీంనగర్‌కు వచ్చాడు. ఆయన తండ్రి పెయింటర్‌గా పనిచేసి ఇటీవల అనారోగ్యంతో ఇంటి వద్దనే ఉంటుండగా తల్లి వంట పనులు చేస్తూ జీవిస్తున్నది. ఒక సోదరుడు ఉన్నాడు. పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం రొంపికుంటకు చెందిన శివకుమార్ ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. కరీంనగర్‌లోని గాంధీరోడ్‌లో నివాసం ఉంటున్నాడు. హోలీ కావటంతో కృష్ణవంశీ, శివకుమార్‌లు స్నేహితులతో కలిసి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం బైక్‌పై వెళుతూ మృత్యువాత పడ్డారు. కృష్ణ వంశీ, శివకుమార్‌ల మరణవార్త తెలుసుకున్న వారి స్నేహితులు, బంధు వులు ప్రభుత్వ ఆసుపత్రికి పెద్ద ఎత్తున చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు.


గుంపులుగా పంట చేనులోకి వెళ్తున్న కోతులు

వానర 'దండయాత్ర'

మల్యాల, మార్చి 25: సమూహాలుగా గ్రామాలు, పంట చేలపై దండయాత్ర చేస్తున్న కోతులతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల గ్రామాల్లో కోతుల బెడద అధికం కాగ పంట చేలను విడిచి పెట్టడం లేదు. గుంపులుగా పంటలపై దాడి చేస్తూ నష్టం చేస్తున్నాయి. దీంతో కోతులను నివారించలేక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం మల్యాల శివారులో గుంపులుగా వచ్చిన కోతులు పంటలపై దాడి చేశాయి. వాటిని తరమడం రైతులకు పెద్ద సమస్యగా మారింది. అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి కాపాడేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం

● రూ. 2 లక్షల ఆస్తి నష్టం

మంథని, మార్చి 25: స్థానిక సీఆర్‌కే అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్ నెం. 306లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సోమవారం అగ్నిప్రమాదం జరిగింది. ప్రభుత్వ ఉపాధ్యాయుడు సూర్యప్రకాష్‌రావు ఈ ఫ్లాట్‌లో అద్దెకు ఉంటున్నారు. ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగడంతో అతని భార్య శ్రీలత కేకలు వేసుకుంటూ బయటకు వచ్చారు. ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో మంథని ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ సదానందం, ఫైర్‌మెన్ శ్రీనివాస్, డ్రైవర్ కం ఆపరేటర్ రమేష్, కోంద్ర నాగరాజు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. అగ్ని ప్రమాదంలో సుమారు రూ. 50 వేల నగదు, రూ. 1.50 లక్షల విలువ చేసే సామగ్రి దగ్ధమైంది.

షార్ట్ సూర్క్యూట్‌తో ఇంట్లోని సామగ్రి దగ్ధం


కాలిపోయిన వస్తువులను పరిశీలిస్తున్న నాయకులు

తంగళ్లపల్లి, మార్చి 24: తంగళ్లపల్లి మండల కేంద్రంలో అద్దెకు ఉంటున్న ఈరీ కైలాసం ఇంట్లో ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఇంట్లోని సామగ్రి దగ్ధమైంది. బాధితుడు కైలాసం తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లో సామగ్రితో సాటు గృహోపకరణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. అలాగే బీరువాలో ఉన్న బంగారు అభరణాలు మంటల్లో కరిగిపోయినట్లు బాధితులు తెలిపారు. బీరువాలో ఉన్నా రూ. 30 వేలు కాలి బూడిదయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని ఎంపీపీ పడిగెల మానసరాజు పరామర్శించి రూ. 3 వేల ఆర్థిక సాయం అందించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జాల్గం ప్రవీణ్ బాధితులను పరామర్శించారు.

రేపు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

గణేశ్‌నగర్, మార్చి 25: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, కరీంనగర్ తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఇన్సూరెన్స్, నెక్సా మోటార్స్, బీవీఆర్ సొల్యూషన్స్,శాశ్వత డెవలపర్స్, ఆనంద నిలయం డెవలపర్స్ వారు సంయుక్త ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ గ్రాడ్యుయేట్, పీజీ 2021,22,23 ప్రస్తుత చివరి సెమిస్టర్ చదువుతున్న కళాశాల, ఇతర కళాశాలల అభ్యర్థులు మేళాకు హాజరుకావచ్చని తెలిపారు. అర్హులైన వారు వారి రెజ్యూమ్‌తో పాటు సర్టిఫికెట్లు వెంట తెచ్చుకోవాలని తెలిపారు. ఈ ఉద్యోగ మేళా గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, కాశ్మీర్‌గడ్డ ఫైర్‌స్టేషన్ వద్ద జరుగుతుందని తెలిపారు.

బావిలో పడి యువకుడి మృతి

రాయికల్, మార్చి 25: హోలీ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని బహిర్భూమికి వెళ్లిన యువకుడు బావిలో కాలుజారి పడి మృతిచెందాడు. జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణానికి చెందిన నర్ర నగేష్ (21) అనే యువకుడు సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తోటి స్నేహితులతో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్నాడు. వీరాపూర్ రోడ్డులోని వ్యవసాయ బావి వద్దకు బహిర్భూమికి వెళ్లి బావిలో ప్రమాదవశాత్తు కాలు జారి పడ్డాడు. స్నేహితులకు ఈత రాకపోవడంతో వెంటనే యువకుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వచ్చి బాలిలో గాలించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది బావి వద్దకు చేరుకుని రెండు గంటల పాటు గాలించగా మృతదేహం లభించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళ మృతి


రాజకుమారి (ఫైల్)

మల్యాల, మార్చి 25: రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ మహిళ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మల్యాల మండల కేంద్రానికి చెందిన గడ్డం రాజకుమారి(43) అనే మహిళ ఈ నెల 22న కుటుంబసభ్యులతో కలిసి కారులో వెలుతుండగా బెజ్జంకి సమీపంలో లారీ ఢీకొంది. దీంతో ఆమె తీవ్రంగా గాయపడటంతో కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్సకు దాదాపు రూ.6లక్షలకు పైగా అవసరం కాగ నిరుపేద కుటుంబం కావడంతో ఆమె కొడుకుతో పాటు పలువురు యువకులు సోషల్‌మీడియా ద్వారా సాయం కోరారు. దాతలు సాయం అందిస్తున్న తరుణంలోనే పరిస్థితి విషమించి రాజకుమారి మృతి చెందింది.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

● ముగ్గురికి గాయాలు

మల్యాల, మార్చి 25: కరీంనగర్-జగిత్యాల మార్గంలోని రాజారం సమీపంలో గల వీఆర్‌కే కళాశాల సమీపంలో ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి గాయాలు అయ్యాయి. కొడిమ్యాలకు చెందిన దండుగుల శేఖర్ తన భార్య ఇద్దరు చిన్నారులతో కలిసి ద్విచక్రవాహనంపై వెలుతుండగా వీఆర్‌కే కళాశాల సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. అదుపు తప్పి వస్తున్న కారును తప్పించుకునే ప్రయత్నం చేసినప్పటికీ ఢీకొనడంతో శేఖర్‌తో పాటు అతని కూతురు సాయివర్శిత, కుమారుడు రుద్రాంశ్‌కు గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. సాయివర్శిత కొద్ది దూరంలో ఎగిరిపడడంతో తలకు గాయాలు కాగా గాయపడిన వారిని చికిత్స కోసం 108లో జగిత్యాలకు తరలించారు.

యువకుడి ఆకస్మిక మృతి

గంగాధర, మార్చి 25: గంగాధర మండలం మధురానగర్‌కు చెందిన వేముల మురళి(42) సోమవారం ఇంట్లోనే ఆకస్మికంగా మృతి చెందాడు. అయితే మురళి మృతికి షాపు యాజమాని కారణమంటూ అతడి ఇంటి ముందు మృతదేహంతో బంధువులు ఆందోళన చేశారు. దీనిపై ఎస్ఐ కిరణ్‌రెడ్డిని వివరాలు కోరగా.. మధురానగర్‌కు చెందిన వేముల మురళి సోమవారం వేకువ జామున నిద్రలోనే మృతి చెందాడు. తెల్లవారినా లేవకపోవడంతో అతని భార్య గౌతమి లేపినా ఎలాంటి స్పందన లేదు. విషయాన్ని మురళి అన్న రమేష్, తల్లికి తెలపగా వారు వచ్చి చూసే సరికి మృతి చెంది ఉన్నాడు.మృతుడి అన్న రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అయితే గత కొన్ని సంవత్సరాలుగా మురళికి చెందిన భూమి విషయంలో పంచాయతీ జరుగుతోంది. భూమి విషయం ఎప్పటికీ తెగకపోవడంతో మానసికంగా ఆందోళన చెంది మృతి చెంది ఉంటాడని బంధువులు, గ్రామస్థులు పేర్కొంటున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళపై కొడవలితో దాడి

● తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం

జగిత్యాలరూరల్, మార్చి 25: జగిత్యాల మండలం తిప్పన్నపేట గ్రామంలో హోలీ పండగ రోజు విషాదం చోటుచేసుకుంది. జగిత్యాల మండలంలోని తిప్పన్నపేట గ్రామానికి చెందిన రమ అనే మహిళ, అదే గ్రామానికి చెందిన బోగు రాకేష్‌ల మధ్య పాత గొడవలు జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో సోమవారం గ్రామంలో యువకులు హోలీ సంబరాలు జరుపుకున్నారు. ఈక్రమంలో బోగు రాకేష్ అనే యువకుడు మేడిశెట్టి రమ ఇంటిలోపలకి కోడి గుడ్డు విసిరారు. ఇదే విషయమై తన ఇంట్లోకి కోడిగుడ్డు ఎందుకు విసిరివేశావు అని రాకేష్ ను రమ కుమారుడు రిషి నిలదీశాడు. దీంతో ఇద్దరి మధ్య మాట, మాట పెరిగి గొడవకు దారి తీసింది. రిషి, రాకేష్ లు ఇద్దరు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. గొడవను ఆపేందుకు వెళ్లిన రమపై రాకేష్ మెడపై కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపర్చాడు. రమ పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైద్రాబాద్ కు తరలించారు. సంఘటన స్థలానికి చేరుకొని జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ విచారణ చేపట్టారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మాయిలకు ఆత్మరక్షణ, ఆత్మవిశ్వాసం అవసరం

● మహిళా కమిషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ నేరెళ్ల శారద

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి25: ఆడపిల్లలకు ఆత్మరక్షణ, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, శారీరక ధారుఢ్యం అవసరమని మహిళా కమిషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. సోమవారం నగరంలోని సిద్దార్థ హైస్కూల్‌లో ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన కరాటే పోటీ పరీక్షలలో కరాటే శిక్షకుడు పుల్లూరి శ్రీనివాస్ వద్ద శిక్షణ పొందిన 150 మంది విద్యార్థులు వివిధ స్థాయి బెల్టులను సాధించినట్లు ఒకినావా సంస్థల చీఫ్ ఎగ్జామినర్ కె.వసంత్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి శారద ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యుద్ధ విద్య ప్రాముఖ్యతను గుర్తించి దీనికి ప్రభుత్వం నుండి ప్రోత్సాహం అందేలా కృషిచేస్తానని అన్నారు. ఈకార్యక్రమంలో సిద్ధార్థ విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీపాల్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక లారీల పట్టివేత


అధికారులు పట్టుకున్న ఇసుకలారీ

ముత్తారం, మార్చి25: మండలంలోని ఓడేడులో మానేరు పరివాహక ప్రాంతంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు లారీలను పోలీసులు, మైనింగ్ అధికారులు పట్టుకున్నారు. ఆదివారం రాత్రి కొందరు వ్యక్తులు ఎటువంటి అనుమతులు లేకుండా మూడు లారీలలో ఇసుక నింపి తరలిస్తుండగా లారీలు దిగబడ్డాయి. విషయం తెలుసుకున్న ముత్తారం ఎస్ఐ మధుసూదన్ రావు సోమవారం సిబ్బందితో వచ్చి మైనింగ్ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు వెంటనే మూడు లారీలను ఒక జేసీబీని సీజ్ చేసి పోలీసుల ఆధ్వర్యంలో స్టేషన్‌కు తరలించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా ఇసుక తరలించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కరీంనగర్ క్రైం, మార్చి 25 : కొత్తపల్లి మండలం ఎలగందుల గ్రామ శివారులో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పట్టుకున్నామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్, యజమానులు వేల్పుల వెంకటరమణ, వేల్పుల తిరుపతిలపై కేసు నమోదు చేశామని తెలిపారు.

రామగుండం కార్పొరేషన్‌లో నియామకాలు బంద్

● ప్రభుత్వ అనుమతి ఉంటేనే కొత్త వారికి అవకాశం ● ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ● మూడేళ్లుగా తిరుగుతున్న ఆగ్రోస్ కార్మికులు ● కార్పొరేషన్‌లో పనుల పేర ఇప్పటికే పెద్దఎత్తున వసూళ్లు

కోల్‌సిటీ, మార్చి 25: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో పనులు పెట్టిస్తామంటూ దళారులు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు అమాయకుల నుంచి లక్షలు గుంజడం పరిపాటి అయ్యింది. ఈ పరిస్థితుల్లో కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లలో ఔట్ సోర్సింగ్‌లో కొత్తగా ప్రభుత్వ అనుమతి లేనిదే ఒక్కరిని కూడా పెట్టరాదంటూ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు మున్సిపల్ కార్యదర్శి దాన కిశోర్ మెమో 6603 తేది:02-02-2024 ద్వారా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. దీంతో ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు లేకుండా రామగుండం నగరపాలక సంస్థలో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఒక్కరిని కూడా నియమించుకునే అవకాశం లేదు. రామగుండం నగరపాలక సంస్థలో ఇప్పటికే పారిశుధ్య విభాగంలో 448 మంది జనరల్, మంచినీటి సరఫరా, ఎలక్ట్రికల్ తదితర విభాగాల్లో మరో 121మంది పనిచేస్తున్నారు. వారు కాకుండా మరో ముగ్గురు ఔట్ సోర్సింగ్, ఒక కాంట్రాక్టు ఉద్యోగి కలిసి 574మందికి కార్పొరేషన్ ప్రతీ నెల వేతనాలు చెల్లిస్తోంది. నెలకు రూ.90లక్షలకుపైగా వీరి వేతనాలకే చెల్లించాల్సిన పరిస్థితి. ఏటా రూ.11కోట్ల మేర సిబ్బంది వేతనాలకు చెల్లిస్తున్నారు. ఇది కూడా సాధారణ నిధుల నుంచి చెల్లించాల్సి ఉంటుంది. రామగుండం నగర ఆదాయం తక్కువగా ఉండడంతో వేతనాల చెల్లింపులకు ఒక్కోసారి ఖజానాలో నిధులు లేని పరిస్థితి ఉంటుంది.

● సింగరేణి, ఎన్‌టీపీసీ ప్రాంతాల్లో సేవల పేరుతో..

రామగుండం నగరపాలక సంస్థలో ఔట్ సోర్సింగ్ కార్మికుల సేవలు పెంచుకునేందుకు మూడేళ్ల క్రితం నగరపాలక సంస్థ సింగరేణి, ఎన్‌టీపీసీ ప్రాంతాల్లో కూడా సేవలందిస్తున్నట్టు నివేదికలు ప్రభుత్వానికి పంపింది.



సింగరేణి ప్రాంతాల్లో సింగరేణి, ఎన్‌టీపీసీ ఏరియాల్లో ఎన్‌టీపీసీ, జెన్‌కో ప్రాంతంలో జెన్‌కో పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ చేస్తున్నాయి. ఆ ప్రాంతాల్లో కూడా కార్పొరేషన్ సేవలందిస్తున్నట్టు, 94చదరపు కిలో మీటర్ల విస్తీర్ణానికి లెక్కగట్టారు. ప్రభుత్వం నుంచి 84మందిని పనుల్లో చేర్చుకునేందుకు అనుమతి లభించింది. ఈ పనులు పెట్టుకోవడంలో కూడా పందుల పెంపకందారులకు ప్రాధాన్యమివ్వాలని, వారికి ప్రత్యామ్నాయ ఉపాధికి అవకాశం ఇవ్వాలని మున్సిపల్ డైరెక్టర్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

కార్పొరేషన్ 50మందికిపైగా ఇంటింటా చెత్త సేకరణ కార్మికులకు అవకాశం ఇవ్వగా, మిగతా పనులకు దళారులు రేట్లుకట్టి అమ్మారు. కార్పొరేషన్ సాధారణ ఆదాయంలో 40శాతం లోపే వేతనాలకు కేటాయించాల్సిన పరిస్థితులు ఉంటాయి. రామగుండం నగరపాలక సంస్థ సాధారణ ఆదాయం పెద్దగా పెరగలేదు. గతంలో సింగరేణి, ఎన్‌టీపీసీ సంస్థలకు పారిశుధ్య, నీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణకు గాను మినహాయింపులు రద్దు చేసి అదనపు ఆదాయం వచ్చిందంటూ 84మంది నియామకాలకు అనుమతులు తీసుకున్నారు. ఆర్‌జీ-2లో కంపెనీ క్వార్టర్లు ఉన్న ప్రాంతాల్లో మున్సిపల్ కార్పొరేషనే పారిశుధ్య నిర్వహణ చేయాలని యాజమాన్యం ఒకింత కొరివి కూడా పెట్టింది. సింగరేణి ఏరియాలో జెన్‌కో ఏరియాల్లో పారిశుధ్యం, వీధి దీపాలు, మంచినీటి సరఫరా నిర్వహించాలంటే మరో 300మంది కార్మికులు ఉంటే కానీ పని కాదు. ఇప్పటికే ఈ ఏరియాల్లో సేవలందిస్తున్నామంటూ నివేదిక ఇచ్చి కార్పొరేషన్ అదనపు నియామకాలు కూడా చేసింది.

● మరో 50మంది వద్ద వసూళ్లు..

రామగుండం నగరపాలక సంస్థలో పనులు పెట్టిస్తామంటూ దళారులు సుమారు 50మంది వద్ద అదనంగా వసూళ్లు చేశారు. ఇప్పటికే ఆగ్రోస్ వాహనాలపై పని చేస్తున్న కార్మికుల నుంచి సుమారు రూ.50లక్షలు వసూలు చేసి మూడేళ్లుగా వారిని గోస పెడుతున్నారు. మూడు నెలలు వేతనాలు పొందే పరిస్థితి లేదు. కొత్తగా పెట్టిన టెండర్‌లో కూడా కేవలం పది మందికే అవకాశం కల్పించారు. వీరు కాకుండా పారిశుధ్య విభాగంలో పనుల పేర మరో 25 నుంచి 30మంది మహిళల వద్ద కూడా పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేసినట్టు తెలుస్తోంది. ఇంకా అమాయకుల నుంచి కొందరు వసూళ్లు చేస్తూనే ఉన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది.

వైభవంగా రుక్మిణిశ్రీకృష్ణ కల్యాణం

- పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్, మార్చి 25: కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలోని శ్రీకృష్ణ ఆలయంలో సోమవారం శ్రీకృష్ణ రుక్మిణి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. వేద బ్రాహ్మణులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం యాదవ సంఘం నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.



కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీకృష్ణుడు సర్వంతర్యామి అని, ఆ దేవుడు దయవల్ల కాల్వశ్రీరాంపూర్ మండలం ధనధాన్యాలతో తులతూగాలని, ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కోరారు. అల్లం దేవేందర్ దంపతులు పూజాక్రతువు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, మాజీ జెడ్పీటీసీ లంక సదయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండీ మునీర్, మాదాసు సతీష్, బంగారు రమేష్ యాదవ సంఘం నాయకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కాలువలను కమ్మేసిన ముళ్ల చెట్లు

- నీరందక ఆందోళన చెందుతున్న రైతులు

పాలకుర్తి, మార్చి 25: మండలంలోని పలు ఎస్సారెస్పీ కాలువులు ముళ్ల చెట్లతో నిండిపోయాయి. .పెద్దపల్లి జిల్లా తుర్కల మద్దికుంట డీ- 83 ప్రధాన కాలువ నుంచి పుట్నూర్ చివరి ఆయకట్టు వరకు నీరు అందించడం కోసం ఎల్-8 ఉపకాలువను, ఆర్-4 అనే మరో కాలువను ఏర్పాటు చేశారు. అలాగే కుర్మపల్లి గ్రామ శివారు నుంచి ఈసాలతక్కల్లపల్లి చివరి ఆయకట్టు వరకు నీరును అందించేందుకు 1-ఎల్ కాలువను నిర్మించారు. గతంలో ఈ కాలువల ద్వారా నీరు రావడంతో అయా గ్రామాల రైతులు వేలాది ఎకరాల భూముల్లో పంటలు సాగు చేసేవారు. కానీ కాలువలు కూలి పోవడం, మరికొన్ని కాలులు తెగిపోవడం మూలంగా నీరురాక పోవడంతో రైతులు పలు రకాల పంటలకు స్వస్తి పలికారు. అయా గ్రామాల్లోని రైతులు నేడు బోర్లు, వ్యవసాయ బావుల మీదనే ఆదారపడుతున్నారు. దంచి కొడుతున్న ఎండలకు భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో పంటలకు సరిపడా నీరు బావుల్లో లేక పోవడంతో అరుగాలం



ముళ్ల కంపలతో నిండిన ఎల్ 8 కాలువ

శ్రమచేసి పండించిన పంటలు నష్టపోయే అవకాశం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారులు కాలువలను బాగుచేయించాలని రైతులు కోరుతున్నారు.

హోలీ సంబరాల దృశ్య మాలిక



పెద్దపల్లిలో హోలీ ఆడుతున్న యువకులు



కాల్వశ్రీరాంపూర్‌లో కూలీలతో హోలీ ఆడుతున్న ఎంపీపీ సంపత్



చిన్నారులతో కలిసి స్టెప్పులేస్తున్న సీపీ శ్రీనివాస్



మంథనిలో యువత హోలీ వేడుకలు



రామగిరిలో సంబరాల్లో పాల్గొన్న నాయకులు, కార్మికులు

అధికారం ఎవరికీ శాశ్వతం కాదు

ధర్మపురి, మార్చి 25: అధికారం ఎవరికీ శాశ్వతం కాదని మాజీ మంత్రి, పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన పార్లమెంటరీ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఒక సారి గెలుస్తామని, మరొకసారి ఓడిపోతామని, కార్యకర్తలు అధైర్య పడవద్దని సూచించారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో రాష్ట్రం పదేళ్ల వెనుకబడి పోయిందని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పరిపాలనలో సంక్షేమ పథకాలు గురించి చర్చ జరగాలని ఆయన అన్నారు. రైతులకు పంట పొలాలకు నీరందక గోస పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మచ్చలేని ప్రజా నాయకుడిగా ప్రజల మధ్య ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. రాబోయే కాలంలో కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రజాక్షేత్రంలో భంగపాటు తప్పదని ఆయన హెచ్చరించారు. ప్రతీ కార్యకర్త తానే అభ్యర్థినని అనుకొని గెలుపుకోసం సైనికుల్లా పనిచేయాలని సూచించారు. సమావేశంలో జగిత్యాల జడ్పీ చైర్‌పర్సన్ దావా వసంత, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, ఎంపీపీ ఎడ్ల చిట్టిబాబు, జడ్పీటీసీ బత్తిని అరుణ, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఇందారపు రామయ్య, రైతుబంధు మండల అధ్యక్షుడు సౌళ్ల భీమయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరు రాజేష్‌కుమార్, వైస్‌ఎంపీపీ గడ్డం మహిపాల్‌రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ అక్కెనపెల్లి సునీల్‌కుమార్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మొగిలి శేఖర్, పట్టణ అధ్యక్షులు ఆకుల రాజేష్ పాల్గొన్నారు.

నాటి పంట పొలాలే నేడు వెంచర్లుగా..

- అనుమతులు లేకుండానే ఏర్పాట్లు
- హెచ్చరిక బోర్డులు పెట్టిన తెల్లారే మాయం
- పెద్దపల్లి మండలంలో విచ్చలవిడిగా వెలుస్తున్న వెంచర్లు

పెద్దపల్లి రూరల్, మార్చి 25: పెద్దపల్లి జిల్లా కేంద్రం కావడంతో మండలంలోని అప్పన్నపేట, గౌరెడ్డిపేట, కొత్తపల్లి, పెద్దకల్వల, బొంపల్లి, చీకురాయి , పెద్దకల్వల, అందుగులపల్లి, హన్మంతునిపేట, పెద్దబొంకూరు, రాఘవపూర్, నిమ్మనపల్లి, సబ్బితం గ్రామాల్లో పంట పొలాలు ఉన్న భూములు నేడు వెంచర్లుగా మారుతున్నాయి. మండలంలోని వ్యవసాయ భూములను కొంతమంది వ్యాపారులు కొనుగోలు చేసి వాటిని ప్లాట్లుగా మారుస్తున్నారు. వ్యవసాయ భూములను అతితక్కువ ధరలో కొనుగోలు చేసి దానిని చదును చేయించి ప్లాట్లుగా మార్చి వాటిని విక్రయిస్తున్నారు. వ్యవసాయ భూమి కమర్షియల్‌గా మార్చేందుకు ప్రభుత్వ అనుమతులు పొందాల్సి ఉన్న వెంచర్ యజమానులు మాత్రం అవేమి పట్టనట్లుగా వ్యవహరిస్తూ ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. పొలాలు, పంట చేన్లను ప్లాట్లుగా మార్చుతున్న వ్యాపారులు రాజకీయ నాయకలు అవసరాలను ఆసరాగా తీసుకొని నిబంధనలను గాలికి వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్లాట్లుగా మారుతున్న వ్యవసాయ భూముల ద్వారా పంచాయతీలకు ఆదాయం వచ్చే అవకాశమున్నా గత ప్రభుత్వం పట్టించుకోలేదనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో అనుమతులు లేకుండా అక్రమంగా ఏర్పాటు చేసిన వెంచర్



రాఘవపూర్ శివారులో వ్యవసాయ భూమిలో వెలసిన వెంచర్





రాఘవపూర్ లో అక్రమ వెంచర్‌లలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న అధికారులు, హెచ్చరిక బోర్డును తొలగించిన వెంచర్ యజమానులు

యజమానులకు పంచాయతీ అధికారులు నోటీసులు ఇస్తున్నప్పటికి స్పందించకపోవడంతో ఏర్పాటు చేసిన వెంచర్లలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. హెచ్చరిక బోర్డు తెల్లారేసరికే మాయం చేస్తున్న పరిస్థితి నెలకొంది. పంట పొలాలను ప్లాట్లుగా మార్చుకోవాలంటే ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. ప్రదానంగా నివాస స్థలాలుగా మార్చాలనుకున్న వ్యవసాయ భూమిని ఎంత విస్తీర్ణంలో లేఅవుట్ చేయాలనుకుంటున్నారో గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్లాటింగ్ ప్లాన్‌తో దరఖాస్తు చేసుకోవాలి. పంచాయతీ పాలకవర్గం సమావేశమే అట్టి భూమిని అనుమతిస్తున్నట్లు తీర్మానించాలి. అనంతరం వ్యవసాయ భూమిని నాన్ అగ్రికల్చర్ ల్యాండ్‌గా తహసీల్దార్ కార్యాలయంలో మార్పు చేసుకోవాలి. ప్లాట్లుగా మారుతున్న భూమిలో పదిశాతం గ్రామ పంచాయతీకి రిజిస్ట్రేషన్ చేయాలి. ప్లాట్లుగా మార్చే స్థలంలో విద్యుత్, మురుగు కాలువలు, రహదారుల ఏర్పాటు చేయాలి. ఇవేమి పట్టనట్టుగా పెద్దపల్లి మండలంలోని గ్రామాల్లో వెంచర్ యజమానులు విచ్చలవిడిగా ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. వెంచర్ యజమానులు ఈవిధంగా చేయడం ద్వారా గ్రామ పంచాయతీ ఆదాయానికి గండి పడటంతో పాటు కొనుగోలుదారులకు సైతం భవిష్యత్‌లో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు వచ్చే అవకాశాలు లేవని అధికారులు పేర్కొంటున్నారు.

● హెచ్చరిక బోర్డులు మాయం..

మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన అనుమతులులేని వెంచర్లలో పంచాయతీ అధికారులు ఇట్టి ప్లాట్లకు అనుమతులు లేవని, ఎవరు కొనుగోలు చేయొద్దని బోర్డులు ఏర్పాటు చేశారు. చీకురాయి, పెద్దబొంకూరు, రాఘవపూర్ గ్రామాల్లో అక్రమ వెంచర్‌లలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే తెల్లారేసరికి బోర్డులు మాయం అయ్యాయి. తిరిగి రాఘవపూర్‌లో రెండోసారి బోర్డును ఏర్పాటు చేయగా దానిని కూడా తొలగించారు. దీంతో పంచాయతీ అధికారులు ఉన్నతాధికారులకు సమాచారాన్ని అందించారు.

● ప్రభుత్వ ఆదాయానికి గండి..

వ్యవసాయ భూములను కొనుగోలు చేసి ఏర్పాటు చేస్తున్న అక్రమ వెంచర్‌లతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. వ్యవసాయ భూమిని నాన్‌అగ్రికల్చర్ ల్యాండ్‌గా మార్చడంతో పాటు, గ్రామ పంచాయతీకి 10 శాతం భూమిని రిజిస్ట్రేషన్ చేయాలి. అయితే వెంచర్ యజమానులు ఇవేమి పట్టించుకోకుండా వ్యవసాయ భూమిలో హద్దురాళ్లను ఏర్పాటు చేసి రోడ్డు వేసి ప్లాట్లుగా విక్రయిస్తున్నారు. దీంతో కొనుగోలు చేసిన వారికి భవిష్యత్‌లో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు రావు. ఈ విషయం తెలియజేసేందుకు అధికారులు వెంచర్‌ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తే తొలగిస్తున్నారు.

● ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

- ఎంపీవో సుదర్శన్, పెద్దపల్లి

ప్రభుత్వ నిబంధనల ప్రకారం వ్యవసాయ భూములను నాలాగా మార్పు చేసి అమ్మకాలు చేయాలి. నిబంధనలు పాటించని వెంచర్లలలో భూములు కొనుగోలు చేసిన కూడా వారికి ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు రావు. ప్రభుత్వం అనుమతులు లేని వెంచర్లలలో హద్దురాళ్లను తొలగించడంతో పాటు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నాము. కొనుగోలు దారులు అనుమతులు ఉన్న వాటినే కొనుగోలు చేయాలి.

రేపు సాంబశివ ఆలయంలో శివకల్యాణం

సుల్తానాబాద్, మార్చి 25: సుల్తానాబాద్ పట్టణంలోని వేణుగోపాల స్వామి వారి ఆలయ అవరణలో ఉన్న శ్రీ భవాని సాంబశివ ఆలయంలో ఈ నెల 27న శివ కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి పారువెల్ల రమేష్ శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ పల్లా మురళి ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో కల్యాణోత్సవం ప్రారంభమవుతుందని భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

పుస్తె, మట్టెలు అందజేత

ఓదెల, మార్చి 25: మండల కేంద్రానికి చెందిన నిరుపేద వెలిశోజు శంకరాచారి, ఉమాదేవి దంపతుల కుమార్తె మౌనిక వివాహానికి జిల్లా స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం పుస్తె, మట్టెలను సోమవారం అందజేశారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుంబ పరిస్థితులను స్వర్ణకారుల సంఘానికి తెలపడంతో జిల్లా అధ్యక్షుడు రంగు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కుటుంబానికి పుస్తె, మట్టెలను అందజేశారు. అలాగే విజయగిరి శ్రీనివాస్ 50 కిలోల బియ్యం, సుల్తానాబాద్ పట్టణ కార్యదర్శి కందుకూరి ప్రకాష్ రావు 25 కిలోల బియ్యాన్ని అందజేశారు. స్వర్ణకారుల కుటుంబాల్లో ఎవరికైనా ఆర్థికపరమైన ఇబ్బందులు వస్తే సంఘం ఆధ్వర్యంలో ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రంగు శ్రీనివాస్, కార్యదర్శి రామోజు రాజు, కనపర్తి భాస్కరచారి, మండల అధ్యక్షుడు వెలిశోజు, రవీంద్రచారి, వెలిశోజు శ్రీధర్, కొండపాక నరసింహాచారి, వరుణ్ చారి, వెంకటరాజం, రమణయ్య, శంకరాచారి, రమేష్ బాబు తో పాటు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు

పెద్దపల్లి రూరల్, మార్చి 25: మండలంలోని దేవునిపల్లి లక్ష్మీనరసింహ ఆలయంలో ఫాల్గుణ మాస పౌర్ణమి సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు శ్రీకాంతచార్యులు స్వామివారికి, అమ్మవార్లకు పంచామృత అభిషేకంతో పాటు అలంకరణ చేసి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్ర మం నిర్వహించారు.



పూజలు చేస్తున్న అర్చకుడు

వైభవంగా ఆది దంపతుల డోలోత్సవం

మంథని, మార్చి 25: హోలీ పండగను పురస్కరించుకొని స్థానిక శ్రీసీలేశ్వర-సిద్దేశ్వరాయంలో, లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ఆది దంపతుల డోలోత్సవాన్ని సోమవారం రాత్రి భక్తులు వైభవంగా నిర్వహించారు. శివాలయంలో శివపార్వతుల, వైష్ణవ ఆలయంలో లక్ష్మీనారాయణస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా ఆలంకరించిన ఊయల్లో ఉంచిన అనంతరం వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. పూజ జరిగినంత సేపు స్వామి-అమ్మవారి విగ్రహాలపై కలశంలోని రంగునీళ్ల చిలకరిస్తూ..ఊయలను ఊపారు. పూజ పూర్తి అయిన అనంతరం ఆది దంపతులకు భక్తులు పసుపు, కుంకుమ, బుక్క, గులాలు సమర్పించారు. శివరాత్రి రోజున జరిగే ఉమా-మహేశ్వరుల కల్యాణోత్సవం అనంతరం వచ్చే హోలీ పండగను సందర్భంగా ఆది దంపతులకు డోలోత్సవం ద్వారా 16 రోజుల పండగను లోకే కుటుంబ సభ్యులు నిర్వహించడం స్థానిక శ్రీసీలేశ్వర-సిద్దేశ్వరాయంలో అనాధిగా సంప్రదాయంగా వస్తోంది. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను కీర్తిస్తూ భక్తులు పాడిన హోలీ పాటలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో లోకే కుటుంబ సభ్యులు, వేద పండితులు దుద్దిళ్ళ మారుతిశర్మ, పూజారి దహగం రమేష్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఐఎన్‌టియుసీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శంకర్

సుల్తానాబాద్, మార్చి 25: కాంగ్రెస్ పార్టీ అనుబంధ కార్మిక విభాగం ఐఎన్‌టీయూసీ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని పూసాల గ్రామానికి చెందిన నీరటి శంకర్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు వడ్డేపల్లి దాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నియామక పత్రాన్ని తెలంగాణ రాష్ట్ర చీఫ్ వైస్ ప్రెసిడెంట్ జనక్ ప్రసాద్ చేతుల మీదుగా అందుకున్నారు.



పూసాల గ్రామానికి చెందిన శంకర్ ఎన్‌ఎస్‌యూఐలో చేరి యువజన విభాగంలో పలు పదవులు నిర్వహించారు. తన నియామకానికి కృషి చేసిన జనక్ ప్రసాద్, దాస్‌కు శంకర్ కృతజ్ఞతలు తెలిపారు.

కాళబైరవుడికి ప్రత్యేక పూజలు



కాళభైరవ స్వామిని దర్శించుకుంటున్న జిల్లా సివిల్ జడ్జి అర్జున్

కోటపల్లి, మార్చి 25: మండలంలోని పారుపల్లి సమీపంలోని కాళభైరవ స్వామిని పెద్దపల్లి జిల్లా అసిస్టెంట్ సెకండ్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి అర్జున్ సోమవారం దర్శించుకున్నారు. భైరవస్వామికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. హోలీ పండగ వేళ ప్రజందలరు బాగుండాలని కోరుకున్న ట్లు ఆయన పేర్కొన్నారు. ఆయనకు స్థానిక సివిల్ పోలీసులు స్వాగతం పలికారు.

బైరం యాదగిరి మృతి బాధాకరం

ఐడీసీ మాజీ చైర్మన్ ఈద శంకర్ రెడ్డి

కాల్వశ్రీరాంపూర్, మార్చి 25: మాజీ సర్పంచ్ బైరం రమేష్ తండ్రి బైరం యాదగిరి మృతి బాధాకరమని ఐడీసీ మాజీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని తారుపెల్లి గ్రామంలో యాదగిరి అనారోగ్యంతో మృతి చెందగా ఈదశంకర్ రెడ్డి హాజరై సంతాపం తెలిపారు. టీడీపీలో ఉన్నప్పటి నుంచి ఇప్పుడు బీఆర్‌ఎస్‌లో ఉన్న తనకు తోడుగా వెంటే ఉండే యాదగిరి మృతి బాధాకరమన్నారు. కొన్ని సంవత్సరాలుగా యాదగిరితో ఉన్న సంబంధాన్ని నెమరు వేసుకున్నాడు. యాదగిరి అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోసాడు. కార్యక్రమంలో జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ గూడెపు జనార్దన్‌రెడ్డి, అయా గ్రామాల మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఎస్సారెస్పీ భవనాలు



శిథిలావస్థకు చేరుకొని కూలుతున్న భవనం

ధర్మారం, మార్చి 25: ధర్మారం మండల కేంద్రంలో నిర్మించిన ఎస్సారెస్పీ భవనాలు శిథిలావస్థకు చేరుకుని కూలిపోతున్నాయి. వీటి స్థానంలో గత ప్రభుత్వ హయాంలో సమీకృత వసతి గృతిహం ఏర్పాటు ప్రక్రియ ప్రతిపాదన దశలోన్లే ఆగిపోయింది. ఎస్సారెస్పీ కాలువ పక్కన 1975లో ఎస్సారెస్పీ కార్యాలయం కోసం ఐదు భవనాలను నిర్మించారు. కొన్నేళ్ల పాటు ఇక్కడ ఎస్సారెస్పీ కార్యాలయాలు కొనసాగాయి. తర్వాత వీటిని ఆ శాఖ అధికారులు వదిలేశారు. దీంతో అప్పటి పరిస్థితుల దృష్ట్యా 1994లో అద్దె భవనంలో కొనసాగుతున్న బీసీ వసతి గృహాన్ని ఖాళీగా ఉంటున్న భవనాల్లోకి తరలించారు. ఈ భవనాలు శిథిలావస్థకు చేరుకుని వర్షం కురుస్తున్నపుడు భవనాలు ఉరుస్తుండడంతో విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉండడం దృష్ట్యా 2019లో ఆభవనాల్లో కొనసాగుతున్న వసతి గృహాన్ని ధర్మారంలోని రాష్ట్ర రహదారి పక్కన ఓ గద్దె భవనాల్లోకి తరలించారు. ఈ భవనాలను కూల్చివేసి సమీకృత వసతి గృహం ఏర్పాటు కోసం గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు పంపారు. కానీ ప్రతిపాదన దశలోనే ఆగిపోయింది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ అవసరాలకు ఉపయోగపడేలా స్థలాన్ని కేటాయించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.